
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
బుధవారం 10 జనవరి 2024



జిల్లాలో నలుగురికి కరోనా

సుభాష్‌నగర్, జనవరి 9: జిల్లా ఆసుపత్రిలో మంగళవారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. ఔట్ పేషంట్లుగా వచ్చిన నలుగురు వ్యక్తులను అనుమానించి ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయగా కరోనా పాజిటివ్‌గా తేలిందన్నారు. రాష్ట్రంలో జేఎన్ 1 సబ్ వేరియంట్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు కరోనా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

ఎరువులు కొనాలంటే

ఆధార్‌కార్డు తప్పనిసరి

- డీలర్లు ఈ-పాస్ మిషన్‌లో రైతుల పేర్లు నమోదు చేయాలి
- హుజూరాబాద్ ఏడీఏ సునీత




హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏడీఏ సునీత

హుజూరాబాద్, జనవరి 9: రైతులు ఎరువులు కొనాలంటే ఆధార్‌కార్డు తప్పని సరిగా దుకాణాల్లో చూపిం చాలని హుజూరాబాద్ ఏడీఏ సునీత అన్నారు. మంగళవారం హుజూరా బాద్ ఏడీఏ కార్యాల యంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఎరువులు పక్కాదారి పడుతున్నాయనే ఉద్దేశ్యంతో ఈ-పాస్ మిషన్‌ను తీసుకొచ్చారన్నారు. రైతులు వ్యవసాయ పంటలకు ఎరువులు అవసరం ఉంటే డీలర్ వద్ద ఆధార్‌కార్డు చూపిస్తే సరిపడా డీఏపీ, యూరియా, పొటాష్, 20-20-13 లాంటి ఎరువులు ఇస్తారన్నారు. ఎరు వుల దుకాణదారులు రికార్డుల్లో ఉన్న ప్రకారం గోదాముల్లో స్టాక్ ఉండాలన్నారు. లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. డీలర్లు రైతుల ఆధార్ నమోదు చేసిన తర్వాతనే ఎరువులు ఇవ్వాలన్నారు. వారబందీ ప్రకారం ఎస్సారెస్పీ నీళ్లు వస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సమావేశంలో ఏవో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను

తేలికగా తీసుకోవద్దు

- అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ సాధించాలి
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి పదేసి కోట్లు
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి మంగళవారం కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది పార్లమెంట్ స్థానాలను గెల్చుకోవడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతున్నదని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యేలు పనులను ప్రతిపాదించాలని, పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గాల ఇన్‌చార్జిలు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రతిపాదనలు అందజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి అలసత్వాన్ని, అవినీతిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారని సమాచారం. ప్రజలకు సేవలందించడంలో ఎమ్మెల్యేలు ముందుండాలని, ప్రజల్లోనే ఉంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. తాను కూడా వారంలో మూడు రోజులు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలుస్తూ వారి నుంచి సమస్యలు తెలుసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

నెలాఖరు నుంచి జిల్లాల వారీగా పర్యటనలు

ఈ నెల చివరి వారం నుంచి జిల్లాలవారీగా పర్యటనలు చేపడతానని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి సభ్యుడు టి జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, కరీంనగర్, హుజూరాబాద్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, ప్రణవ్‌బాబు, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరుకాలేదని సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి నెల రోజుల పరిపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేశారు.

బండి సంజయ్ పోరాట యోధుడు

- ఆయనను మళ్లీ ఎంపీగా గెలిపించాలి
- మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): బండి సంజయ్ పోరాటయోధుడని, భారతదేశమంతా చర్చ జరిగేలా పాదయాత్ర చేసిన నాయకుడని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన పార్లమెంట్ నియోజక వర్గ స్థాయి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండి సంజయ్‌ను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మంచి మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్‌కు రావడం సంతోషంగా ఉందని, కుటుంబ సభ్యులను కలిసినట్లుగా ఉందన్నారు. తనను అందరూ మేనమామ అంటారని, కరీంనగర్‌కు వచ్చి మీ అందరిని కలిసే భాగ్యం దక్కింద న్నారు. బండి సంజయ్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించనంత మెజారిటీతో గెలిపించి చరిత్ర సృష్టించాలన్నారు. బీజేపీ చరిత్రలో ఇంత వరకు రాష్ట్రమంతా పాదయాత్ర చేసిన నాయకుడు ఎవరూ లేరన్నారు. తెలంగాణలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ పదికి పైగా ఎంపీ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చూపంతా బీజేపీవైపే ఉందన్నారు. బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతానికి పైగా ఓట్లు వచ్చాయని, ఒక్కసీటు నుంచి 8 ఎమ్మెల్యే సీట్లలో గెలిపించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పదికి పైగా సీట్లు సాధించి బీజేపీ సత్తా చాటాలన్నారు. భారత దేశాన్ని అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్రమోదీ అవిశ్రాంతంగా పని చేస్తున్నారన్నారు. ఆర్థిక ప్రగతిలో ప్రపంచంలోనే భారత్‌ను ఐదో స్థానానికి చేర్చారన్నారు. రానున్నరోజుల్లో భారత్‌ను అగ్రభాగాన నిలిపి విశ్వగురువుగా మార్చబోతున్నారన్నారు. ఈనెల 22వ తేదీన దేశమంతా రామయం కాబోతున్నదన్నారు. దివ్యమైన భవ్యమైన రామమందిరాన్ని పునఃప్రతిష్ఠ చేసుకోబోతున్నామన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బీజేపీ కార్యకర్తల పార్టీ అని, తనకు ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం కల్పించిందన్నారు. ఆడపిల్లలను లక్ష్మిగా భావించి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయడంతోపాటు చదివించే అవకాశం దక్కిందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఇంటింటికి మరుగుదొడ్లు, జన్‌ధన్‌ఖాతాలు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఇందులో భాగమే అన్నారు. ఒక్కో పోలింగ్ బూత్ అధ్యక్షుడు తనపరిధిలోని బూత్ నుంచి కనీసం 20 మందిని పార్టీ సభ్యులుగా చేర్పించాలన్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పార్టీ సంస్థాగతంగా బలంగాఉంటే గెలుపు సులభమవుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా చేసుకుని అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించారన్నారు. జాతీయ పార్టీ పెట్టి రాజకీయాలు చేసిన బీర్‌ఎస్ చివరకు అక్కడా, ఇక్కడా, ఎక్కడా కాకుండా పోయిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గల్లీలో, ఢిల్లీలో లేకుండా పోయిందదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ శివరాజ్‌సింగ్ చౌహాన్ మధ్య ప్రదేశ్‌లో 18 ఏళ్లకు పైగా సీఎంగా పని చేసిన గొప్ప నాయకుడన్నారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇంటి దగ్గరకు వెళ్లగానే మామాకా ఘర్ (మేనమామ ఇల్లు) అని కనిపిస్తుందన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 1.4 లక్షల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారన్నారు. దీనికంతటికి కారణం ఆయన ప్రవేశపెట్టిన పథకాలే అన్నారు. మధ్యప్రదేశ్‌లో 230 స్థానాలుంటే బీజే పీకి 163 స్థానాల్లో గెలిపించారన్నారు. ఏ సర్వేలు చూసినా బీజేపీ గెలిచే స్థానాల్లో కరీంనగర్ మొదటి స్థానంలో ఉందన్నారు. 40 శాతం ఓట్లు బీజేపీ రాబోతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాటా డుతూ బండి సంజయ్‌ను గెలిపించి ఢిల్లీకి పంపడానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ వచ్చారన్నారు. తెలంగాణలోని రాజకీయ పరిస్థితులన్ని ఆయనకు తెలుస న్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ ప్రజల పక్షాన కొట్లాడి జైలుకు వెళ్లిన గొప్ప నాయకుడు బండి సంజయ్ అన్నా రు. పార్లమెంట్ ఎన్నికల్లో సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల పార్టీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాపరామక్రిష్ణ, దూది శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమదేవి, జిల్లా ఇన్‌చార్జిలు మీసాల చంద్రయ్య, వెూహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్

సదరం సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం చేయొద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, జనవరి 9: సదరం సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం జరగ కుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన సదరం శిబిరాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై జరిగే సదరం క్యాంపును 150 మందికి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపునకు హాజరైన వారికి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిం చాలి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రిసూపరింటెండెంట్ జి వీరారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

మానకొండూర్, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. మండలంలోని కొండపల్కల లో మంగళవారం రాత్రి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశాన్ని శక్తివంతమైన అభివృద్ధి చెందిన సుసంపన్న దేశంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. జాతి సమైక్యత, సమగ్రతను కాపాడేలా చరిత్రాత్మక నిర్ణయాలను తీసుకుంటున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు దేశంలోని చిట్టచివరి పేదవారికి అందించేలా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఉచితంగా బియ్యం, గోధుమలు అందిస్తున్నామని తెలిపారు. కొవిడ్ మహమ్మారితో దేశం అతలాకుతలం అవుతున్న సమయంలతో దూరదృష్టితో ఫార్మా సంస్థలకు సహకారాన్ని అందించి దేశ ప్రజలకు రెండు వందల కోట్ల వ్యాక్సిన్‌ను ఉచితంగా అందజేశామన్నారు. మహిళలు కట్టెల పొయ్యిలపై వంట చేసుకుంటూ అవస్థలు పడకుండా ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లను అందిస్తున్నామని తెలిపారు. రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా సహాయం అందిస్తున్నామని, నష్టపోయిన రైతులను ఫసల్ బీమా యోజన ద్వారా ఆదుకుంటు న్నామని చెప్పారు. 2047 నాటికి భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హోం మంత్రిత్వ శాఖ డైరెక్టర్ యోగేశ్ మహన్ దీక్షిత్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ద్వారా కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాల న్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్‌లో నమోదు చేసుకున్న వారందరికి దేశంలోని ఏ ఆసుపత్రులోనైనా చికిత్స చేసుకునే అవకాశం ఉందన్నారు. రేపటి భావిభారతం ఆరోగ్యంగా ఉండాలంటే సంకల్పంతో రూపొందించిన పోషన్ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణిగా ఉన్నప్పటి నుంచి పోషకాహారాన్ని అందిస్తున్నామని వివరించారు. అంతకు ముందు ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సర్పంచ్ నల్ల వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు గుర్రాల వెంకట్‌రెడ్డి, గట్టు రజిత పాల్గొన్నారు.



కొండపల్కలలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న శివరాజ్‌సింగ్‌చౌహన్, ఎంపీ సంజయ్‌కుమార్, కలెక్టర్ పమేలా సత్పతి

ప్రారంభమైన పండగ సందడి

- ఇంటింటా పిండి వంటకాల ఘుమఘుమలు
- చుక్కలను చూపుతున్న ధరలు





కరీంనగర్ కల్చరల్, జనవరి 9: పండగ అంటే సందడి. అందరూ కలిసి ఒక చోట ఆనందంగా గడిపితే అది పండగే. సంక్రాంతి అనగానే పిండి వంటలు గుర్తుకు వస్తాయి. పండగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కమ్మని పిండి వంటలు ఆరగిస్తూ సంతోషంగా గడుపుతారు. జిల్లా కేంద్రంతోపాటు ఏ గ్రామంలో చూసినా పిండి వంటల ఘుమఘుమలు అందరి నాలుకలకు రుచుల ఆనందాన్ని పంచుతున్నాయి. పండగకు నాలుగైదు రోజుల ముందు నుంచే చకినాలు, గారెలు, అరిసెలు, చేగోడీలు, మురుకుల తయారీలో జనం నిమగ్నమయ్యారు.

పరస్పర మైత్రి - సహకారం..

ఇంట్లో మూకుడు పెట్టారంటే మహిళలు, ఇరుగుపొరుగు, బంధువులతో సందడి నెలకొంటుంది. చకినాలు చుట్టడం కోసం వీరిని ఆహ్వానిస్తారు. మహిళలందరూ కబుర్లు చెప్పుకుంటూ పిండివంటలు చేస్తారు. దీంతో పరస్పర మైత్రి, సహకారం, సత్సంబంధాలు నెలకొంటాయి.



గిర్నీలకు గిరాకీ...

పిండి వంటల్లో బియ్యం పిండి కీలకం. ఎక్కడ చూసినా గిర్నీల (మరయంత్రాలు) వద్ద సందడి ఉంటోంది. వినియోగదారులు బారులు తీరి బియ్యం మూటలను లైన్లలో పెట్టి పట్టించుకుంటున్నారు. శనగ, పెసర, చక్కెరను కూడా పట్టించుకుంటున్నారు. వ్యాపారులు బియ్యం కిలోకు 15 రూపాయల చొప్పున మిగిలిన వాటికి 10 నుంచి 25 రూపాయల వరకు తీసుకుంటున్నారు.

చుక్కలు చూపుతున్న ధరలు...

పిండి వంటకాలలో ఉయోగపడే ముడి వస్తువుల ధరలు చుక్కలను చూపుతున్నాయి. ఈ యేడు ధరలు పెరిగిపోయాయి. ఐదు కిలోల పిండివంటలు చేసుకోవాలంటే రెండు వేల నుంచి 2500 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నువ్వులు కిలోకు 220, శనగపప్పు 90, పల్లీలు 130, శనగపిండి 100 , రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 110, పల్లినూనె 160 రూపాయలు పలుకుతోంది.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

పూర్తయ్యేనా..?

నిలిచిపోయిన పనులు.. లబ్ధిదారుల ఎదురుచూపులు

చొప్పదండి, జనవరి 9: ఆరేళ్ల కింద పునాది వేసుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూంల ఇళ్ల పథకం చొప్పదండి మండలంలో పేదలకు అందలేదు. ఫలితంగా లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. చొప్పదండి పట్టణంలోని పాత వెదురుగట్టు రోడ్డులో 2018 ఫిబ్రవరి 10న ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. నిర్మాణ స్థలంలో కొందరు పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయగా తిరిగి వెనక్కి తీసుకున్న అధికారులు డబుల్ బెడ్‌రూంలకు కేటాయించారు. ఏడాది తర్వాత పనులు ప్రారంభ మయ్యాయి. అప్పటి నుంచి నత్త నడకన సాగుతున్నాయి. మొత్తం 1149 మంది ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా 169 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. చొప్పదండి పట్టణంలో 76, రుక్మాపూర్, చాకుంట, కొలిమికుంట, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, వెదురుగట్ట, భూపాలపట్నం, కోనేరుపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లో 93 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. చొప్పదండిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం 50 శాతం కూడా పూర్తికాలేదు. ఆర్నకొండలో 69 ఇళ్ల నిర్మాణం చేపట్టగా 80 శాతం వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించి నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని ప్రకటించినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఏళ్ల గడిచినా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. కొత్త ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి అంద జేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



చొప్పదండిలో నిలిచినపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, జనవరి9: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 1,195 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామన్నారు. జూబ్లీబస్‌స్టేషన్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్‌కు అదనపు బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు బస్సులకు ఎలాంటి అదనపు చార్జీలు లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను చూడాలని ఆర్ఎం సూచించారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 17 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 9: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారంలో -4, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్‌కేఎన్‌ఆర్ జగిత్యాల లో-3, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, మూడో సెమిస్టర్‌లో ఎస్‌కె ఎన్‌ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగిత్యాలలో-1, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ముగ్గురు డీబార్ అయినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 9: నగరంలోని ఓ భవనంలో పీఓపీ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని కరీంనగర్ రెండో టౌణా పోలీసులు తెలిపారు. హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫరీద్‌ఖాన్(47) సాయినగర్‌లోని రాజాథియేటర్ ఎదుట ఒక భవనంలో పీఓపీ పనులు చేస్తున్న సమయంలో రెండో అంతస్తులోని విద్యుత్ వైర్‌ను మొదటి అంతస్తు నుంచి లాగుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఫరీద్‌ఖాన్ మృతి చెందాడు. మృతుడి కొడుకు లక్కీ ఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీపై విచారణ

కరీంనగర్ క్రైం, జనవరి9: కరీంనగర్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని రికార్డు గదిలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కొన్ని డాక్యుమెంట్లు చోరీ చేసినట్లు అనుమానిస్తున్న ఘటనపై మంగళవారం పోలీసులు విచారణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఒకటో టౌణా పోలీసులు ఇప్పటికే కార్యాలయ ఉద్యోగుల వేలి ముద్రలను సేకరించగా కొందరు ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించారు.

ఇటుకబట్టీలో బాలకార్మికుడు : కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 9: సిరిసిల్ల పట్టణంలోని రగుడు సమీపంలో గల అయ్యప్ప మణికంఠ స్వామి ఇటుక బట్టీ యజమాని జనగామ రాజేశ్వర్ రావుపై మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ ఉపేందర్ తెలిపారు. ఇటుకబట్టీల వద్ద వ్యాన్‌లో ఇటుకలను ఒరిస్సా ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు లోడు చేస్తుండగా ఆపరేషన్ స్మైల్ రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితి ఎదుట హాజరుపరిచింది. ఈ మేరకు బాలకార్మికుడితో పనిచేయించిన యజమానిపై డిసిపియు ఉద్యోగి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు. ఓ జిన్నింగ్ మిల్లులోనూ బాలకార్మికుడు పనిచే స్తుండగా రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితికి అప్పగించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

చందుర్తి, జనవరి 9: చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద ఓ వృద్ధుడిని మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నక్క యోసెఫ్ అనే వృద్ధుడు బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాల య్యాయి. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై అశోక్ చేరుకొని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, జనవరి 9 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దోమ్మాట నాగరాజు, ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన కాసారపు కాశయ్యలు ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట మండలం గోరంటాలలోని బంధువుల వద్దకు వచ్చి, తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సముద్రలింగాపూర్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో కాశయ్య తలకు, నాగరాజు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

వీరిద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గ మధ్యలో కాశయ్య మృతి చెందాడు. నాగరాజుకు కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహేష్ పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు. .

నేడు వీరభద్రస్వామి కల్యాణం

● హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ


శ్రీవీరభద్రస్వామి

భీమదేవరపల్లి, జనవరి 9 : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరగనుంది. స్వామి వారి కల్యాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. స్వామివారి కోనేరు పక్కన గల కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అందజేయనున్నారు. స్వామి వారి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంతో పాటు కల్యాణం జరిగే మండపం వద్ద విద్యుదీకరణ పూర్తి చేశారు. కల్యాణానికి కొత్తకొండతో పాటు ముస్తాఫాపూర్, గట్లనర్సింగాపూర్, ఎర్రబెల్లి, మల్లారం, ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు జ్యోతి, కృష్ణవేణి, కృష్ణప్రసాద్ తదితరులకు కల్యాణ ఆహ్వాన పత్రికలు అందజేశామని, వారు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

అదుపు తప్పి ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● ఎగిసిపడిన మంటలు.. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ● తప్పిన ప్రాణాపాయం


బోల్తాపడి మంటలు అంటుకున్న ఆయిల్ ట్యాంకర్

మెట్‌పల్లి, జనవరి, 9: మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారిపై వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వేకువజామున టైర్ పేలి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్యాంకర్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు మరింత ఎక్కువయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఆరు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ నుంచి మల్లాపూర్ మండలంలోని రాఘవుపేట గ్రామానికి ఆయిల్ ట్యాంకర్ బయలు దేరింది. వేకువజామున పట్టణ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ట్యాంకర్ టైర్ పేలి బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ ట్యాంకర్ నుంచి దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ట్యాంకర్‌కు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమినించి వెంటనే అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. మంటలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకోవడంతో అది పేలి మరింత ఎక్కువయ్యాయి. దీంతో సమీపంలో ఉన్న గు రుకుల పాఠశాల, పెట్రోల్ బంక్‌కు మంటలు అంటుకుని పెద్ద ప్రమాదం సంభవిస్తుందేనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాకు ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై చిరంజీవి కోరుట్ల, మల్లాపూర్ ఎస్సైల సహకారంతో వాహనాలను ఇబ్రహీంపట్నంలోని పలు గ్రామాల మీదుగా దారి మళ్లించారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మెట్‌పల్లి పట్టణంతో పాటు చుట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, డీఎఫ్‌వో మురళీ మనోహర్, ఏఎఫ్‌వో భానుప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు పెంచారు. ఇప్పటి వరకు మూడు వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా ఆరు వేల క్యూసెక్కులకు పెంపు చేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 66.526 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 8,162 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, అల్లీసాగర్ ఎత్తిపోతల పథకానికి 502 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాలువకు 2 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 155.049 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. యాసంగి పంట నీడి విడుదల ప్రణాళిక ప్రకారం ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కాకతీయ కెనాల్ (ఎల్‌ఎండీ పైన) జోన్ -2 పరిధిలోని ఆయకట్టు వినియోగం కోసం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఈ నెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎస్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు మానకొండూర్‌కు మంత్రి పొన్నం

మానకొండూర్, జనవరి 9 : రాష్ట్ర బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం మానకొండూర్ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాలండర్ ఆవిష్కరణ, నిజాయితీగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గంగిపల్లిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, జనవరి 9: నవోదయ విద్యాయలంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతా యారు ఒక ప్రకటనలో తెలి పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 7,105 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్ డౌన్‌లో డ్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొ న్నారు. దరఖాస్తులో కులం, కేటగిరీ, అర్బన్, రూరల్, పుట్టిన తేదీ, జెండర్ నమోదులో తప్పిదాలు జరిగినట్లయితే అన్ని ఆధారాలతో ఈ నెల 16వ తేదీలోగా తమ విద్యాలయంలో సంప్రదించాలని, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దని ఆమె తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

మెట్‌పల్లి, జనవరి 9: మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనా రాయణ స్వామి, శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు.

నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి, శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు


కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొ క్కులు తీర్చుకున్నారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బద్దిపోచమ్మకు భక్తుల మొక్కులు


బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 9: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామునే అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో శివసత్తుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించారు. కళ్లసాకతో పాడి, పంట, పిల్లపాపలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ హరిహరనాథ్ పర్యవేక్షించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

ఇల్లందకుంట, జనవరి 9: అమాయక ప్రజలను బెదిరింపులకు గురి చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జమ్మికుంట రూరల్ సీఐ కొర కిశోర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలంలోని గుండ్లకర్తి గ్రామానికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేష్‌లు స్నేహితులు. వీరు ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను బెదిరిస్తూ డబ్బులు, ఇవ్వాలని వేదిస్తుండేవారని చెప్పారు. వారి వేధింపులు భరించలేక బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి సురేష్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎవరైనా అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తే కేసులు తప్పవని సీఐ కిశోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో పార్కింగ్ ఇబ్బందులు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. మంగళవారం వందలాది వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలిరాగా కొండపైన, వైజంక్షన్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వై జంక్షన్ వద్ద వాహనాలు ఒకదాని వెనుక మరొకటి చిక్కుకొని ముందుకు వెళ్లడానికి నానా కష్టాలు పడ్డారు. పార్కింగ్, ట్రాఫిక్ జాంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో మహిళ మృతి


మధుప్రియ(ఫైల్)

తంగళ్లపల్లి, జనవరి 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడురులో మంగళవారం పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మల్లెబోయిన మధుప్రియ (28) అనే మహిళా రైతు మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు గ్రామానికి చెందిన రాకేశ్- మధుప్రియ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పొలంలో మధుప్రియతోపాటు మరో ఆరుగురు వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో కర్ర సహాయంతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌కు వెళ్లే విద్యుత్ వైరు జారి పొలంలో పడింది. అక్కడే వరినాటు వేస్తున్న మధుప్రియ వైర్‌ను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాకేశ్, కుమారుడు రిషిత్(8), రిషిత (6) ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిడ్‌మానేరులో భూమి కోల్పోయి పేదరికం అనుభవిస్తున్న కుటుంబంలో ఇల్లాలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా అన్నకూటోత్సవం

కోరుట్ల, జనవరి 9 : పట్టణంలోని అతిపురాతనమైన వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం అన్న కూటోత్సవ (తిరుప్పావడ సేవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బీర్నంది నరిసింహాచారి మత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గద్య, విష్ణు సహస్రపారాయణం నిర్వహించి తిరుప్పావై సేవ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కూటోత్సవ కోసం తయారు చేసిన పులిహోరను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఆండాళ్ గోష్టి బృంద సభ్యులు పాల్గొన్నారు.


వైవేద్యంతో ప్రత్యేక అలంకరణ

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



వేడుకల్లో చిన్నారులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, జనవరి 9: వావిలాలపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో 'ఆల్ఫోర్స్ సంక్రాంతి ఉత్సవ్-2024' పేరిట మంగళవారం సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పూజలు జరిపి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకోవాలని గొప్ప సందేశమిచ్చే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు.

ఎస్‌వీజేసీ కళాశాలలో సంబరాలు



భోగి మంటలను ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 9: నగరంలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల (ఎస్‌వీజేసీ)లో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, హరికృష్ణ, శ్రీరామ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు కాంస్య పతకాలు

కరీంనగర్ రూరల్,జనవరి 9: అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఫుట్‌బాల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో కళాశాలకు చెందిన ఎల్ వీక్షిత్, జి సిరిశరణ్ ప్రతిభ చాటి కాంస్య పతకాలు సాధించారన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో ఈ నెలలో జరగనున్న దక్షిణ భారత షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన పాఠశాల విద్యార్థులు సీహెచ్ ఆశిష్, శ్రీనయన్ బాలాజీ, వి సాత్వికలు ఎంపికయ్యారు. విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

టీఎస్ సెట్‌లో అర్హత సాధించిన శ్రీ చైతన్య అధ్యాపకులు



కృష్ణారెడ్డి | జి.యాకాంబ్రం | కె.వెంకటేష్

గణేశ్‌నగర్, జనవరి 9: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులు టీఎస్ సెట్‌లో అర్హత సాధించారని మంగళవారం కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి కంప్యూటర్ శాస్త్ర విభాగంలో, జి.యాకాంబ్రం జీవశాస్త్రంలో, కె.వెంకటేష్ తెలుగు భాష విభాగంలో అర్హత సాధించారని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్ క్రైం, జనవరి 9 : కరీంనగర్ గాంధీరోడ్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిందని స్థానికులు తెలిపారు. భాగ్యవతి అనే మహిళ తను నివాసం ఉంటున్న అద్దె ఇంటికి తాళం వేసి తీగలగుట్టపల్లికి వెళ్ళగా మంగళవారం ఇంటి తలుపులు తెరచి ఉన్న విషయం స్థానికుల ద్వారా తెలుసుకుంది. దొంగలు సొమ్ములు ఎత్తుకెళ్ళారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మంత్రి గారూ.. పింఛన్ ఇప్పించండి



వికలాంగుడు నిజానం రాజయ్య

చిగురుమామిడి, జనవరి 9: రెండు కాళ్లు లేవు.. ఏ పని లేకుండా ఇంట్లోనే ఉంటున్నా.. దయచేసి పింఛన్ ఇప్పించండి అంటూ సుందరగిరి గ్రామానికి చెందిన నిజానం రాజయ్య(75) అనే వృద్ధుడు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరుతున్నాడు. అనారోగ్య సమస్యతో తన రెండు కాళ్లు తొలగించారని తెలిపాడు. వికలాంగుల సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ హాస్పిటల్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పేరు మీద చెవిటి వాడిగా ఆన్‌లైన్‌లో నమోదైందని, అది రద్దు అయ్యేదాక సర్టిఫికెట్ ఇవ్వరాదని డాక్టర్లు చెప్పారన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వికలాంగుల సర్టిఫికెట్ ఇప్పించాలని, పింఛన్ వచ్చేలా చూడాలని కోరుతున్నాడు.

సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

చొప్పదండి, జనవరి 9: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రాగంపేట జడ్పీ స్కూల్‌లో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అర్ధాంతరంగా నిలిచిపోయిన బదిలీలు, ప్రమోషన్స్ చేపట్టి, స్పౌజ్‌కు న్యాయం చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉద్యోగులకు ఆశించిన ఆర్థిక ప్రయోజనాలు లభించాయని, ఇహెచ్ఎస్ వంటి ఇతర సౌకర్యాల కల్పన జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొగిలి లచ్చయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎగదండి బబిత, జిల్లా కార్యదర్శి పల్నాటి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెడ్ పోస్ట్‌మాస్టర్ మహేందర్

హుజూరాబాద్, జనవరి 9: హుజూరాబాద్ పట్టణంలోని పోస్టాఫీస్‌లో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం హెడ్ పోస్టుమాస్టర్ ఊకంటి మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కేంద్రంలో ఆధార్ నమోదు, ఆధార్‌లో సవరణలు, డెమోగ్రాఫిక్ (పేరు, పుట్టిన తేదీ, వయస్సు, లింగం, అడ్రస్, మొబైల్ నంబర్, ఈమెయిల్), బయోమెట్రిక్ (ఫొటో, వేలిముద్రలు, కనుపాపలు) సంబంధించిన ఒరిజినల్ పత్రాలను తీసుకొచ్చి నమోదు, మార్పులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని హుజూరాబాద్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మద్యం దుకాణం ఎదుట మహిళల నిరసన

-నివాసాలు, దుకాణాల మధ్య వైన్స్ ఏర్పాటు చేయవద్దని డిమాండ్



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న మహిళలు

కరీంనగర్ క్రైం, జనవరి 9: నగరంలోని గాంధీ రోడ్డులోని వైన్ షాప్ అనుమతిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మద్యం దుకాణం ఎదుట స్థానిక మహిళలు, వస్త్ర వ్యాపారులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సీపీఎం కార్యదర్శి గుడికందుల సత్యం, స్థానిక కార్పొరేటర్ మెండి శ్రీలత మార్షల్‌లు మాట్లాడుతూ మహిళలు, చిరు వ్యాపారాలు నడుపుకునే ప్రాంతంలో వైన్ షాప్ పెట్టి వందల మంది కుటుంబాల జీవితాలను నాశనం చేయొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారన్నారు. దీంతో చిరు వ్యాపారస్తులను, వైన్ షాప్ యజమానిని పిలిచి చర్చలు జరిపి ప్రజలకు అభ్యంతరం లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారన్నారు. అయినప్పటికీ ఈరోజు వైన్ షాపు ప్రారంభించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా వైన్ షాపును షిఫ్టింగ్ చేయాలని ఎక్సైజ్ డీసీని ఆదేశించినట్లు తెలిపారు. మంత్రి ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా వ్యవహరిస్తూ వైన్ షాప్ యజమాని షాపును ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు శాంతియుతంగా నిరసన పోరాటం చేపడుతున్నామని అయినా వైన్ షాప్ యజమాని వినకుంటే కార్యాచరణను రూపొందించి పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. వైన్ షాప్ అనుమతి రద్దు చేసేంతవరకు పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ డీసీకి వినతి పత్రం అందజేశారు. వైన్‌షాప్‌ను షిఫ్టింగ్ చేస్తామని డీసీ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వ జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, రోజా, సామాజిక కార్యకర్త వసీం అహ్మద్, వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షకార్యదర్శి కందుల వెంకటేశం, వెంగల్ దాస్ అశోక్, కొమ్ముల కుమార్, వరలక్ష్మి సూర్య, లావణ్య సిపిఎం నగర కమిటీ సభ్యులు కొంపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి9: ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవరంగాల్లో విశిష్ట సేవలందించిన యువతకు జిల్లా స్థాయి యువసేవా పురస్కార్- 2024, అవార్డులను అందించనున్నట్లు తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షులు, సత్తినేని శ్రీనివాస్, కన్వీనర్ వోడ్నాల రాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్‌లోని జ్యోతినగర్ శివా థియేటర్ ముందు గల స్వామి వివేకానంద కాంస్య విగ్రహం ముందు జనవరి 12న శుక్రవారం ఉదయం 10 గంటలకు స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించి అనంతరం అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్ కుమార్, నగర మేయర్ వై.సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి,యువ సేవా పురస్కార్ అవార్డు కమిటీ చైర్మన్ చల్లహరిశంకర్, ,కార్పొరేటర్లు ,సర్పంచ్ లు ,చైర్మన్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేసిన పత్రిక క్లిప్పింగ్స్, ఫొటోలు జత చేసి కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల37 డివిజన్ మీకోసం కార్యాలయంలో ఈనెల11 సాయంత్రం 5గంటలలోపు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 8008499955, 9052641722, నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళా ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ

కరీంనగర్ అర్బన్, జనవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం ప్రారంభించి నెల రోజులు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నరాజ మల్లయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రయాణికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, కాంగ్రెస్ నాయకులు దండి రవీందర్, దొంత రాజయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం

-మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ అర్బన్, జనవరి 9: బీజేపీ నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలు, పాలకవర్గ సభ్యుల సహకారం, గంగుల కమలాకర్, వినోద్ కుమార్‌ల అండదండలు, అధిష్ఠానం అంగీకారంతో నగర మేయర్‌గా ఎన్నికయ్యానని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కష్టపడి ఎదిగిన వ్యక్తినని, 37 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజలు, పాలకవర్గ సభ్యుల మద్దతుతో మేయర్‌గా కొనసాగుతున్నానని తెలిపారు. రమేశ్‌లాగా వ్యక్తిగత ఆరోపణలు చేసి తప్పుడు ప్రచారాలతో రాజకీయ పబ్బం గడిపే స్థాయికి దిగజారలేదని మేయర్ ధ్వజమెత్తారు. వినోద్‌కుమార్ వ్యక్తిత్వం, మనస్తత్వం ప్రజలకు తెలుసని వచ్చే ఎన్నికల్లో పూర్తి మద్దతుతో విజయం సాధిస్తామన్నారు.

'యూనివర్సిటీ భూకబ్జాలను అడ్డుకుంటాం'

సుభాష్‌నగర్, జనవరి 9: శాతవాహన యూనివర్సిటీకి సంబంధించిన భూమిని కబ్జా చేయాలని చూస్తే అడ్డుకుంటామని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనీల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకులు, రిటైర్డ్ ఉద్యోగులతో కలిసి యూనివర్సిటీకి సంబంధించి భూమిలో కొంత భాగం కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిని తాము అడ్డుకొని, ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఆయన వెంటనే స్పందించి సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. యూనివర్సిటీలో నిర్మించిన హాస్టల్ భవనం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న సమయంలో తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 25లక్షలు మంజూరు చేయడంతోనే దానిని నిర్మించడం జరిగిం దన్నారు. యూని వర్సిటీకి ప్రహరీ నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్ళామని, దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొన్నం మధు, ఎన్ఎస్‌యూఐ నాయకులు రాంప్రసాద్, అజయ్, వివేక్, సాయి, విష్ణు, శ్రీధర్, పవన్‌సాయి, అజయ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టెన్నీ కాయిట్, టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరికాలనీలో నిర్వహించిన టెన్నీకాయిట్ పోటీలకు జిల్లాలోని 175 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అలాగే మానకొండూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెంజర్లలో నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలకు 175 మంది క్రీడాకారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరై ప్రతిభచాటారు. అలాగే పోటీల నిర్వహణకు 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరై పోటీలను నిర్వహించారు. ఉదయం ఈ పోటీలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పూదరి రమేశ్, శ్రీనివాస్, విష్ణు, అంతటి శంకరయ్య, హరీష్ పాల్గొన్నారు.

'మత్స్యకారుల సంక్షేమానికి కృషి'

సుభాష్‌నగర్, జనవరి9: మత్స్యకారుల సంక్షేమానికి తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కృషి చేస్తుందని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశంలో ఆయన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షునిగా మాల కనకయ్య, ప్రధాన కార్యదర్శిగా పెసరు కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఏరవేణి రామాంజనేయులు, కూనచ్చుల మహేందర్, భూమా సంపత్, కార్యదర్శులుగా పప్పు సమ్మయ్య, గొల్ల శ్రీనివాస్, బినమేని చంద్రమౌళి, గుండ్ల వెంకట్, ఘనవేని మల్లేశంలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండల కమిటీలను నియమించుకున్న తరువాత పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో మత్స్య రంగం అభివృద్ధికి, మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి తెలంగాణ ఫిషరీస్ సొసైటీ కట్టుబడి పని చేస్తుందన్నారు. సమగ్ర కార్యాచరణతో తాము ముందుకు వెళ్తామన్నారు.

గ్రావిటీ కాలువకు నీటి సరఫరా

● ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి ప్రయత్నం



చొప్పదండి ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న రైతులు

రామడుగు, జనవరి 9: రామడుగు మండలంలోని గ్రావిటీ కెనల్‌కు ఎట్టకేలకు నీటి సరఫరా కొనసాగుతోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీరు కొనసాగుతున్న విషయం విదితమే. అయితే గ్రావిటీ కెనాల్‌పై ఆధారపడి సాగు చేసిన పంటలకు నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపూర్, దత్తోజీపేట తదితర గ్రామాల రైతులు సమస్యను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. గ్రావిటీ కెనాల్‌లో నీళ్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, నీటిని విడుదల చేయాలని కోరడంతో ఆయన గాయత్రి పంపుహౌస్ అధికారులను నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో వారు ఈ సమస్య తమ పరిధిలో లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించడంతో ఎమ్మెల్యే సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ నుంచి వస్తున్న నీటిని 5.75 కిలో మీటర్ల వద్ద గేట్లను ఎత్తి గ్రావిటీ కెనాల్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎస్సారెస్పీ నీరు గాయత్రి పంపుహౌస్ డెలివరీ పాయింట్ వరకు చేరుకుంది. గ్రావిటీ కెనాల్‌లో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యంతో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫాతిమా షేక్ జయంతి

హుజూరాబాద్, జనవరి 9: హుజూరాబాద్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో భారతదేశ తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 193వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్, కౌన్సిలర్ బర్మావతి యాదగిరి, హెచ్ఎం ఖైరున్నీసాబేగం, ఉపాధ్యాయులు తేక్లమ్మ, శ్రావణి, నాయకులు ఖాలీద్‌హుస్సేన్, ఎస్కే జలీల్, ఉప్పు శ్రీనివాస్, రత్నం, చంద్రశేఖర్, జమదగ్ని, లక్ష్మణమూర్తి, అలీమ్, వంశీ, సల్మాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలని వినతి

సైదాపూర్, జనవరి 9: సైదాపూర్ మండలంలోని ఘనపూర్ ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిని కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌కు, ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో ఎంఈవో కార్యాలయంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిప్పారపు భువనచంద్ర, బెల్లం గణేష్, తోడేటి శ్రీధర్, తీగల ఆనందం పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ పేరు మార్పు

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, జనవరి9: మండల కేంద్రంలో గల కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ పేరు మార్పుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019వ సంవత్సరంలో గత ప్రభుత్వం చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేసి దానికి కృష్ణమనేని వెంకట్రామారావు ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌గా నామకరణం చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం ఆ పేరును జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుగా మార్పుతూ రవాణా శాఖలో మొట్టమొదటి జీవోను ప్రిన్సిపల్ సెక్రటరీ కెఎస్ శ్రీనివాసరాజు విడుదల చేశారు.

అయోధ్య పూజిత అక్షింతల వితరణ

రామడుగు, జనవరి 9: రామడుగు మండలం రంగసాయిపల్లి గ్రామంలో అయోధ్య పూజిత అక్షింతల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఈ నెల 22న ఇంటింటా 5 దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాదు మునీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గుర్రం దేవిక, ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు మంచికట్ల సూర్య భాను, బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కట్ల రవీందర్, రంగసాయిపల్లి గ్రామ బూత్ కన్వీనర్లు మునిగంటి శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం గ్రామ పంచాయతీ బోరు పైపు మాయం

శంకరపట్నం, జనవరి 9: శంకరపట్నం మండలం ధర్మారం గ్రామపంచాయతీ బోరు పైపు మాయమైనట్లు సర్పంచ్ చుక్కల రవి తెలిపారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఉంచిన సుమారు రూ. 30వేల విలువ చేసే 500ఫీట్ల బోరు పైపు దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పద్మశాలి సంఘం నేతకు ఘన నివాళి



హుజూరాబాద్‌లో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

హుజూరాబాద్, జనవరి 9: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ ప్రాంత పద్మశాలి టీఆర్ఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందగా మంగళవారం పద్మశాలీలు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం రామ శ్రీనివాస్ మృతి చెందడం పద్మశాలి సమాజానికి తీరని లోటని వారన్నారు. కార్యక్రమంలో జక్కుని సంజయ్‌కుమార్, జడల చిరంజీవి, బండారి సదానందం, వేముల యాదగిరి, వొడ్నాల విజయ్, సబ్బని రాజేందర్, చిలకమర్రి శ్రీనివాస్, మంద బిక్షపతి, చంద్రశేఖర్, సత్యనారాయణ, శ్రీనివాస్, సాయి, సంపత్, జగన్, శంకర్, రాజు, కోటిలింగం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పొన్నం పర్యటన

కరీంనగర్ అర్బన్, జనవరి 9: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం రాత్రి కరీంనగర్ చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో సమావేశం కానున్నారు. 10 గంటలకు మానకొండూర్ మండలం గంగిపెల్లి గ్రామంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, 11:30 గంటలకు నిజాయితీగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం హుస్నాబాద్‌కు వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డీవో, ఎమ్మార్వో, ఎంపీడీఓలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు హుస్నాబాద్‌లో నూతన బస్సులను ప్రారంభించనున్నారు. అనంతరం 4:30 గంటలకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. 5:30 గంటలకు భీందేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొననున్నారు. అనంతరం ఆయన వరంగల్ గుండా హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 9: నగరంలో బుధవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్,టూ ఏడీఈలు, సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ తెలిపారు. 33కెవి శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో విద్యానగర్, శ్రీరాంనగర్, కోటయస్వాడ, ఆదిత్యనగర్, యూనివర్సిటీ ఏరియా, 11/కెవి కమాన్ ఫీడర్‌లో 33కెవి, టవర్‌లైన్ పని కారణంగా గాయత్రీనగర్, మధుగార్డెన్ ప్రాంతం, లక్ష్మీనగర్, శాషామహల్, 11/కెవి జ్యోతినగర్, ఫీడర్లలో జ్యోతినగర్ కోర్టు వెనుకవైపుపాత డిఐజి భవన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రాముడి అక్షింతలు పంపిణీ

కరీంనగర్‌రూరల్, జనవరి 9: అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు ద్వారా వచ్చిన అక్షితలను రేకుర్తిలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రేకుర్తి 18వ డివిజన్‌లో వెంకటేశ్వరనగర్ కాలనీ, హనుమాన్ నగర్ కాలనీల్లో అమృతేశ్వర ఆలయ తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వ ర్యంలో తీసుకువచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీరామ భక్తులు అంజన్‌సాయి, అఖిల్, లక్ష్మణ్, జితేందర్ పాల్గొన్నారు.

మాజీ సీఎంకు సన్మానం

భగత్‌నగర్, జనవరి 9: మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను బీజేపీ సీనియర్ నాయకులు దుర్గం మారుతి సత్కరించారు. కరీంనగర్ వచ్చిన మాజీ సీఎంకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా దుర్గం మారుతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో బీజేపీ అగ్రనాయకుల పర్యటనలకు బీజేపీ సీనియర్ కార్యకర్తలకు సమాచారం ఇవ్వడం లేదని వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో బాసం కుమార్, గోదారి చంద్రయ్య, బండారి రాజలింగు, గొల్లపల్లి తిరుపతి, దుర్గం జగ్గయ్య, మేరుగు ఓదయ్య పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు వివేకానంద ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎంపిక

గణేశ్‌నగర్,జనవరి 9: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్ జాతీయ యువజనోత్సవాలకు ఎంపికైనట్లు కళాశాల ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం అధికారి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్.గోపికృష్ణ తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 12వ తేదీ నుండి 16 తేదీ వరకు నిర్వహించనున్న యువజన ఉత్సవాలకు కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ సిరి తెలంగాణ రాష్ట్రం, శాతవాహన విశ్వవిద్యాలయ బృందం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఎ.సిరిని కరస్పాండెంట్ వి.ఆగమరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ టౌన్, జనవరి 9: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లాశాఖ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని మంగళవారం నగరంలోని బీఎస్ ఎన్ఎల్ కార్యాలయం ముందు కార్మికులచేత ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాచంద్రారెడ్డి, కార్యదర్శి బాలయ్య పాల్గొన్నారు.

నాయబ్ తహశీల్దార్‌గా నిజాముద్దిన్

వీణవంక జనవరి 9: మండల నూతన నాయబ్ తహశీల్దార్‌గా సయ్యద్ నిజాముద్దీన్‌ను నియామిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పని చేసిన నాయబ్ తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కరీంనగర్ కలెక్టర్‌ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు

వీణవంక జనవరి 9:మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన దూడం నరేందర్ గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తు ఎక్కువ ధరలకు మద్యం అమ్ముతుండగా 10,420 రూపాయల మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

చర్చి అభివృద్ధికి ఆర్థికసాయం

వీణవంక జనవరి 9:మండలంలోని బేతిగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి గొట్టె గోపాల్ పదివేల ఆర్థిక సాయం పాస్టర్ ఎస్ రత్నంకు అందజేశారు. తన తల్లి జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో గోట్టె సుధకార్, నందయ్య, గౌతంకృష్ణ, రాకేష్, శ్రీరాం ఐలయ్య, కార్తీక్, తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

చొప్పదండి, జనవరి 9: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. వొల్లాల నరీన్‌కాంత్‌గౌడ్ లక్ష రూపాయల విలువగల గ్రానైట్‌ను ఆలయానికి విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు చెన్నమాధవుని పవనసు త రాజు, ఉపాధ్యక్షులు కాసు వేణుగోపాలరాజు, కార్య నిర్వహణ కమిటీ అధ్యక్షులు గజ్జెల అశోక్, మొగిలిపాలెం అనిల్, కనకట్ల ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

రామడుగు, జనవరి 9: రామడుగు మండలం దేశరాజుపల్లి మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నేత మ్యాన మురళీధర్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో పా ర్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షునికి పంపించిన లేఖలో మురళీధర్ పేర్కొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

చొప్పదండి, జనవరి 9: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో మంగళవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అప్పిడి సౌజన్య మాట్లాడుతూ బాలికలు జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత సంరక్షణ కలిగి ఉండాలని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రస్మా మండల అధ్యక్షుడిగా సంపత్‌రావు

జమ్మికుంట, జనవరి 9: జమ్మికుంట పట్టణంలోని లోటస్ పాండ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ట్రస్మా మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు కోరెం సంజీవ రెడ్డి సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.